క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కె.గంగవరం: మండల సర్వ సభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్. శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

ఇసుక ర్యాంపుల పరిశీలన



కోరుమిల్లి ర్యాంపులో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ బానో

కపిలేశ్వరపురం: మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ఇసుక ర్యాంపులను గురువారం రామచంద్రపురం ఆర్డీఓ ఖాతీబ్ కౌసర్ బానో సందర్శించారు. ఇసుక ర్యాంపులను తెరిచే ప్రక్రియలో భాగంగా కోరుమిల్లి, కపిలేశ్వరపురం, తాతపూడి, నారాయణలంక గ్రామాల్లోని ర్యాంపులను పరిశీలించారు. స్థానిక పరిస్థితులు, గతంలో ర్యాంపుల నిర్వహణలో తలెత్తిన పరిస్థితులను తహసీల్దార్ చిన్నారావు, ఇతర రెవెన్యూ అనుబంధ శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. నారాయణలంక, కేదారిలంక గ్రామాల్లోని పట్టా భూముల నుంచి ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చే అవకాశాలను తెలుసుకున్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

పెదపూడి: మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలోని మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

21న 'తోరాటి' వర్ధంతి



తోరాటి లక్ష్మణమూర్తి (ఫైల్)

కపిలేశ్వరపురం: స్వాతంత్ర్యానంతరం తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేసిన సాయుధ పోరాటంలో వీరమరణం పొందిన అంగర గ్రామానికి చెందిన తోరాటి లక్ష్మణమూర్తి వర్ధంతిని ఈనెల 21న నిర్వహించనున్నారు. తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం నిర్వాహక కమిటీ నాయకులు పెద్దింశెట్టి లక్ష్మణమూర్తి గురువారం ఈ విషయాన్ని తెలిపారు. అంగర గ్రామంలో పేరు ప్రఖ్యాతులు, సిరి సంపదలన్నీ ఉన్న కుటుంబంలో పుట్టినప్పటికీ పేద ప్రజలు కోసం జీవిత కాలమంతా కృషి చేశారన్నారు. 1951 అక్టోబర్ 21న వికారాబాద్ ప్రాంతంలో రైతులనుద్దేశించి ప్రసంగిస్తుండగా పోలీసులు జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందారని ఆయన త్యాగాన్ని గుర్తు చేసుకునేలా వర్ధంతిని నిర్వహిస్తున్నట్టు లక్ష్మణమూర్తి తెలిపారు.

గృహానికి శంకుస్థాపన

కాజులూరు: గ్రామానికి చెందిన సాంబత్తుల ఇందిరకు చెందిన ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదానికి కాలి బూడిదయింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం బాధిత కుటుంబీకులను పరామర్శించి ఇంటి నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాకినాడకు చెందిన యూటీఎఫ్ చేయూత స్వచ్ఛంద సంస్థ గృహ నిర్మాణానికి కొంత ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకు వచ్చింది. గురువారం వాసంశెట్టి సత్యం గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

వరద బాధితులలకు రూ.4.25 లక్షల చెక్కు అందజేత



రూ.4.25లక్షల చెక్కును అందజేస్తున్న పాఠశాల డైరెక్టరు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాయవరం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సేకరించిన రూ.4.25లక్షల చెక్కును ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌కు గురువారం అందజేశారు. రాయవరం గ్రామానికి చెందిన సాయితేజా విద్యానికేతన్ విద్యార్థులు సమీకరించిన నగదును చెక్కు రూపంలో పాఠశాల డైరెక్టరు కర్రి సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయవాడలో అందజేశారు. ఏడుగురు విద్యార్థులు, అధ్యాపక బృందం సభ్యులతో కూడిన బృందం చెక్కును అందజేసింది.

నిరుపయోగంగా రైల్వే క్వార్టర్లు

కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన రైల్వే క్వార్టర్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయం మంచిదే అయినా ముందుచూపు లేక భవనాలు ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కనీసం ఈ భవనాలను స్థానికులకు అద్దెకు ఇచ్చినా కొంతైనా ప్రభుత్వానికి ఆదాయం సమకూరేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాని రైల్వే క్వార్టర్లు
- ప్రారంభం కాకముందే శిథిలావస్థకు
- పాలకులకు కొరవడిన ముందుచూపు

కె.గంగవరం: నియోజకవర్గంలోని రామచంద్రపురం పట్టణం, కె.గంగవరం మండలాల్లో సుమారు రూ.3 కోట్ల ప్రజాధనంతో 2002లో ఈ రైల్వే భవనాలను నిర్మించారు. అయితే ప్రస్తుతం ఇవి ఎందుకు పనికి రాక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉంటే కె.గంగవరం మండలంలోని కోటిపల్లి వద్ద నిర్మించిన రెండు రైల్వే క్వార్టర్సు కనీసం ప్రారంభానికి కూడా నోచుకోలేదు. భవనాల నిర్మాణం కూడా అసంపూర్తిగా ఉంది. ప్రస్తుతం భవనాల లోపల తుప్పలు పెరిగి పాములు సంచరిస్తున్నాయని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయాల్లో కె.గంగవరంలోని రైల్వే భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. 2001వ సంవత్సరంలో అప్పట్లో కేంద్ర రైల్వే మంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో ఈ రైల్వే లైనుకు నిధులు మంజూరు చేసి నిర్మాణం కూడా పూర్తి చేశారు. కోటిపల్లి-నరసాపురం రైల్వే లైను నిర్మాణం జరగకపోవడం వల్ల ఇవి పూర్తిగా నిరుపయోగంగా మారిపోయాయి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ రైల్వే లైనుకు కొంత నిధులు మంజూరు చేసినా వంతెన పూర్తి కావడానికి మరో పదేళ్లు పట్టేస్తుందని స్థానికులు చెబుతున్నారు. అప్పటి ఈ భవనాలు కాస్తా శిథిలావస్థకు చేరుకుంటాయని పట్టణ వాసులు అంటున్నారు. రామచంద్రపురం పట్టణంలో ఉన్న ఈ భవనాలను అద్దెకు ఇస్తే కనీసం రైల్వే శాఖకు కొంతైనా ఆదాయం చేకూరుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా 16 ఏళ్లుగా ఈ రైల్వే భవనాలు నిరుపయోగంగా మారడం, ప్రస్తుతం శిథిలావస్థకు చేరే స్థితిలో ఉండడం అయోయానికి గురి చేస్తున్నాయి.



కోటిపల్లిలో నిరుపయోగంగా రైల్వే భవనాలు

ఉపయోగకరంగా మార్చాలి..



రైల్వే భవనాలు నిరుపయోగంగా మారకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఏళ్ల తరబడి ఇవి శిథిలావస్థలోనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలు శిథిలావస్థకు చేరకముందే వినియోగంలోకి తీసుకువస్తే బాగుంటుంది.

రెడ్డి జయరాజు, మాజీ సర్పంచి, సుందరపల్లి.

రైల్వే లైను పూర్తి చేయాలి



కోటిపల్లి రైల్వే లైనును వీలైనంత త్వరగా ప్రభుత్వం పూర్తి చేయాలి. ఇప్పటికే కోట్లు ఖర్చు చేసిన కాకినాడ-కోటిపల్లి రైల్వే లైను అంతంత మాత్రంగా వినియోగంలో ఉంది. ఈ లైను కోసం ఏర్పాటు చేసిన భవనాలు కొంత వరకు ఉపయోగంలోకి రావాలంటే రైల్వే లైను పూర్తి చేయాలి.

పెట్టా శ్రీనివాస్, ఎంపీపీ, కె.గంగవరం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రామచంద్రపురం: పట్టణ సబ్ స్టేషన్‌లో 11కేవీ టౌన్ ఫీడర్, ఓదూరు చెల్లూరు ఫీడర్‌ల మరమ్మతులు కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని డివిజన్ ఎక్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెయిన్ రోడ్డు, రత్నంపేట, హౌసింగ్ బోర్డు, లలితానగర్, ముచ్చుమిల్లి, రామకృష్ణ సెంటర్, బ్రాడీపేట, మార్కెట్ సెంటర్, ఏరియా ఆసుపత్రి, గాంధీహాస్పిటల్, ముచ్చుమిల్లి రోడ్డు, ఆర్డీవో కార్యాలయం, కమ్మవారిసావరం, కవలవారిసావరం, ఓదూరు, ఆక్వా చెరువులు, నరసాపురపుపేట, చోడవరం, వీఏస్ఎం కళాశాల, గుబ్బల వారిపేట, స్టీల్‌విల్‌పేట, అంకంవారివీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కమిషనర్‌ను కలిసిన జేఏసీ నేతలు



మున్సిపల్ కమీషనర్ నాయుడిని కలిసిన జేఏసీ నేతలు

రామచంద్రపురం: మున్సిపల్ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వీబీవీ నాయుడుని ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఉపాధ్యక్షులు మాధవరపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నేతలు కమీషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పురపాలక సంఘం అభివృద్ధికి తీసుకునే నిర్ణయాల్లో తమ వంతు సహకారం అందజేస్తామని తెలిపారు. ఏపీ నాన్ గెజిటెడ్ అఫీసర్స్ అసోసియేషన్ రామచంద్రపురం యూనిట్ కార్యదర్శి కారుపర్తి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కేవీఎస్‌బీ, జేఏసీ నాయకులు గొల్లపల్లి కృష్ణ, కోనరామారావు, కనకాల వీరభద్రరావు, డీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాల పోటీలు

రాయవరం: లొల్లలో విశ్వమానవత సంస్థ 33వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 19న సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించనున్నారు ఈ విషయాన్ని విశ్వ మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి గురువారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 19న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో పాటుగా, 108 సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. విద్యార్థులతో పాటు పెద్ద వయస్సు వారు కూడా పాల్గొనవచ్చునన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 9966673283 నంబర్‌కు లేదా 9966673111 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

కాజులూరు: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులతో పంట సాగు చేపట్టినప్పుడే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించగలుగుతారని జేడీఏ ఎస్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం శీలలో మండల వ్యవసాయాధికారి వి అశోక్ ఆధ్వర్యంలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో భాగంగా జేడీఏ ఎస్ విజయ్‌కుమార్, కరప ఏడీఏ కె బాబూరావు తదితరులు పాల్గొని ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. అవసరాన్ని మించి ఎరువులు, పురుగు మందులు వాడకుండా సేంద్రియ ఎరువులు, వేప కషాయం వంటివి వినియోగిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధించాలన్నారు. పురుగు మందుల అవశేషాలు లేని నాణ్యమైన ఉత్పత్తులను రైతు ఉత్పత్తి సంస్థ (ఎఫ్‌పీఓ)ల ద్వారా రైతులు అధిక ధరలకు విక్రయించుకోవచ్చునన్నారు. సమీకృత వ్యవసాయ విధానాన్ని (ఐఎఫ్ఎస్ మోడల్) రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ, మీఏఏ ఎం రామకృష్ణ, రైతు సంఘాల నాయకులు నల్లమిల్లి రామారెడ్డి, గరగ కొండలరావు, చిట్నీడి సత్యనారాయణ, సూర్యనారాయణ, గుంటముక్కల సుబ్బారావు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకున్న నల్లమబ్బులు



దివిలో ఆకాశం నీలి మబ్బులతో కమ్ముకుంది. భువిలో నేల పచ్చదనంతో పరవశించింది. ఈ రెండింటిని కలిపేలా ప్రకృతి రమణీయంగా మెరిసిపోయింది. తుపాను కారణంగా వర్షాలు కురుస్తున్న తరుణంలో ఆకాశాన్ని నల్లగా మబ్బులు కమ్ముకున్నాయి. ఈ మబ్బులు అందరినీ ఎంతగానో అబ్బురపరిచాయి. ఈ అందమైన దృశ్యం అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాల వద్ద కెమేరాను క్లిక్ మనిపించింది.

– కపిలేశ్వరపురం

వైఎస్ జగన్‌ను కలిసిన సూర్యప్రకాశ్



తాడేపల్లిలో వైఎస్ జగన్‌తో సూర్యప్రకాశ్

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని నియోకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సూర్యప్రకాశ్ తెలిపారు.

విద్యావేత్త పంపన అర్జునరావు మృతి



పంపన అర్జునరావు (ఫైల్ ఫోటో)

రామచంద్రపురం రూరల్: మండలంలోని బాపనయ్య చెరువు గ్రామానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, పారిశ్రామిక వేత్త పంపన అర్జునరావు గురువారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అర్జునరావు మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. విశాఖపట్నంలో స్థిర పడిన ఆయన ఏవీకే స్కూల్స్, జూనియర్, డిగ్రీ కళాశాలలు నిర్వహిస్తున్నారు. గాయత్రీ ఫ్యాబ్రికేషన్స్, లక్ష్మీ ప్రభ ఇండస్ట్రీలు స్థాపించి ఎంతో మందికి జీవనోపాధి కల్పించారు. 2004 సంవత్సరంలో ఆయన రామచంద్రపురం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున శాసన సభ్యునిగా పోటీ చేసి ఓటమి చెందారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ బెంగళూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఈ నెల 19న ఉదయం 9 గంటలకు ఆయన అంత్యక్రియలు విశాఖపట్నంలోని ఆటోనగర్‌లో నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. ఆయన మృతికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘ నాయకులు నరాల ఏడుకొండలు, వాసంశెట్టి శ్యామ్, బాపనయ్యచెరువు సర్పంచ్ పిల్లి సూర్యప్రకాశ్ తదితరులు సంతాపం తెలిపారు.

మద్యాన్ని ఏరులై పారించేలా ప్రభుత్వ విధానం

కపిలేశ్వరపురం: మద్యం వినియోగాన్ని తగ్గిస్తూ సామాన్య కుటుంబాలను మెరుగుపర్చే బాధ్యత గల ప్రభుత్వం అందుకు భిన్నంగా మద్యాన్ని ఏరులై పారించేలా అమలు చేస్తోందని ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు ఎం.గౌరవ్ అన్నారు. అంగరలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేద కుటుంబాలను కునారిల్లేలా చేస్తున్న మద్యాన్ని నిషేధించాల్సిన ప్రభుత్వాలు ధరలు తగ్గించామంటూ మద్యాన్ని మరింత తాగేలా వ్యవహరించడం బాధ్యతా రాహిత్యమన్నారు. చారిత్రాత్మక మద్య నిషేధ ఉద్యమం జరిగిన ఆంధ్రప్రదేశ్‌లో మద్యం ధరలు తగ్గించామంటూ ప్రచారం చేసుకోవడం ప్రజారోగ్యాన్ని, సామాజిక ఐక్యతను దెబ్బతీయడమే అవుతుందని ప్రభుత్వ తీరుపై గౌరవ్ ఆరోపించారు.

నేత్రానందంగా దుర్గమ్మ ప్రతిష్ఠా మహోత్సవం



పెదపట్నంలంక ఘటాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: పెదపట్నంలంక కనకదుర్గమ్మ 33వ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవోపేతంగా జరిగింది. దీనిలో భాగంగా అమ్మవారికి ఘటాభిషేకం ఘనంగా నిర్వహించారు. సుమారు 108 మంది మహిళలు ఈ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. పెదపట్నం గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ గంటి శ్రీనివాసు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి ఆలయం వద్ద గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ పూజ, నవగ్రహారాధన, నక్షత్ర ఆరాధన తదితర పూజలను నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు, బాణాసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా వైనతేయ గోదావరి నదికి వెళ్లారు. అక్కడ గోదావరి నదీ తీరంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వైనతేయ గోదావరి నదిలో చక్రస్నానం చేయించారు. అనంతరం గోదావరి నది నుంచి ముత్తయిదువులు అమ్మవారి ఆలయానికి ఘటాలతో నదీ జలాలు తీసుకువచ్చారు. ఈ నదీ జలాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం తదుపరి కనకదుర్గమ్మకు లక్ష కుంకుమార్చన, లలితా హోమం వైభవంగా చేపట్టారు.

పశువులకు ఉచిత వైద్య సేవలు



పాడి రైతులకు ఉచితంగా మందుల పంపిణీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్లలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. మండపేటలోని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ట్రెయినింగ్ సెంటర్ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఆర్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఆ శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.నాగేశ్వరరావు, రామచంద్రపురం ఏడీ డాక్టర్ ఓ.రామకృష్ణల పర్యవేక్షించారు. మండపేట పశు వైద్యాధికారి డాక్టర్ వీజీఎస్ ప్రసాద్, వెల్ల పశు వైద్యాధికారి డాక్టర్ పి. రామచంద్రరావు, ద్రాక్షారామ పశు వైద్యధికారి డాక్టర్ మేడిశెట్టి కృష్ణార్జున, పామర్రు పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్.బిందులు 84 మంది రైతులకు చెందిన 124 పశువులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. రూ.20 వేలు విలువైన గర్భకోశ వ్యాధుల మందులు, మినరల్ మిక్చర్, కాల్షియం, హార్మోన్ ఇంజక్షన్‌లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, మండపేట ట్రైనీ డాక్టర్లు, గోపాలమిత్రలు వైద్య సహకారం అందించారు. గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీలు చిక్కాల స్వామికాపు, మంచెం దేవి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అయినవిల్లి: ముక్తేశ్వరం ఎస్ఎస్‌వీఆర్ ప్రభుత్వ కళాశాలలో రసాయన శాస్త్రం బోధించడానికి అర్హులైన అతిథి అధ్యాపక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డి. శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు నందు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. వీరికి గంటకు రూ.150లు చొప్పున గరిష్ఠంగా రూ.10 వేలు గౌరవ వేతనంగా చెల్లించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్లను ఈ నెల 19లోపు అందజేయాలన్నారు. ఎంపిక ప్రక్రియ అభ్యర్థుల బోధనా పటిమ ఆధారంగా జరుగుతుందన్నారు.

భేతాళ మహోత్సవం.. చూచిన కనులదే భాగ్యం



శ్రీనివాస నగర్‌లో కొలువైన విజయ భేతాళ స్వామి

- నేడు భేతాళ వాహనాల మహోత్సవం
- 13 వాహనాలతో భక్తులకు కనువిందు
- 58 ఏళ్లుగా కొనసాగుతున్న ఉత్సవం

అంబాజీపేట: విజయదశమి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా జరిపే విజయ భేతాళ స్వామి వాహన మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. రంగూన్, మయన్మార్ (బర్మా) ప్రాంతాల్లో భేతాళ ఉత్సవాలు జరుగుతాయి. పూర్వకాలంలో అంబాజీపేట, పేరూరులకు చెందిన కొంత మంది కూలి పనుల నిమిత్తం రంగూన్ తదితర ప్రాంతాలకు వెళ్లినప్పుడు భేతాళ ఉత్సవాలను నిర్వహించడం గమనించారు. భేతాళ ఉత్సవం నిర్వహించడం, పూజించడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తున్నట్లు గమనించారు. విదేశాలకు వలస వెళ్లిన వారు తిరిగి స్వదేశానికి వచ్చిన తరువాత వారు కూడా స్థానికంగా భేతాళ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

నాలుగు దశాబ్దాలుగా కొనసాగింపు

1967లో శెట్టిబలిజ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించిన భేతాళ ఉత్సవాలు నాలుగు దశాబ్దాలుగా నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. 1981లో అంబాజీపేట పెద్దవీధి శివారు శ్రీనివాస్‌నగర్‌లో విజయ భేతాళ స్వామి ఆలయాన్ని నిర్మించి దొమ్మేటి శ్రీరాములు, పితాని నాగిశెట్టి, శీలం వెంకట్రావుల ఆధ్వర్యంలో విస్తరించారు. ఈ ఉత్సవానికి 13 ప్రాంతాల నుంచి తరలివచ్చే వాహనాలు అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్‌లో కొలువు దీరడం, పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చడం, చేడీ తాళింఖానాలు ప్రత్యేక శోభను తెస్తాయి. 13 ప్రాంతాల నుంచి విద్యుత్ దీపాలతో అలంకరించిన వాహనాలపై తమకు ప్రీతిపాత్రమైన దైవ రూపాలను అలంకరించి మేళతాళాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగించుకుంటూ అంబాజీపేట సెంటర్‌కు చేరుకుంటారు. పెద్దవీధి, బస్టాండ్ రోడ్డు, గన్నవరం రోడ్లలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆద్యంతం భేతాళ స్వామి వాహనాల మహోత్సవం కనువిందు చేయనుంది.

కొలువుతీరే వాహనాలివే

శ్రీనివాస్‌నగర్ నుంచి గరుక్మంతుడు, పెచ్చెట్టివారిపాలెం నుంచి గరుక్మంతుడు, మాచవరం శ్రీరామ్‌నగర్ నుంచి సింహం వాహనం, దొమ్మేటివారిపాలెం నుంచి శ్రీకృష్ణుడు, స్త్రీల ఆస్పత్రి దొమ్మేటివారిపాలెం నుంచి శ్రీ ఆంజనేయస్వామి, పోతాయిలంక నుంచి శ్రీ ఆంజనేయస్వామి, గంగలకుర్రు మలుపు నుంచి శ్రీ విజయ గణపతి, మాచవరం ఇటికాలమ్మ గుడి నుంచి హంస వాహనం, కొత్తపాలెం నుంచి హంస వాహనం, చప్పిడివారిపాలెం నుంచి శ్రీషిరిడీ సాయిబాబా, గుత్తుల వారిపాలెం నుంచి సింహం, నందంపూడి నుంచి శ్రీరాజరాజేశ్వరీదేవి, శ్రీనివాసనగర్ నుంచి ఏనుగు వాహనాలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటాయి.

అధికారుల ఫోన్ నంబర్లు

కపిలేశ్వరపురం మండలం

ఎ.శాంతి	మండల ప్రత్యేకాధికారి	9154409527
చిన్నారావు	తహసీల్దార్	8008803196
కేవీఎస్ రమేష్‌కుమార్	ఏఓ, వ్యవసాయ శాఖ	8331056560
డా.పీఎస్ఎస్‌డి రత్నకుమారి	వైద్యాధికారి, అంగర	9247861182
డా.కె.విజయదీపిక	వైద్యాధికారి అచ్యుతాపురం	9182650968
డా.సీహెచ్.రాకేష్ కృష్ణ చౌదరి	వైద్యాధికారి, వాకతిప్ప	9742129535
కె.తాతారావు	ఎంఈఓ, విద్యాశాఖ	9492479542
కె.శ్రీనివాసరెడ్డి	ఏఈ, హౌసింగ్	7093930492
వీరభద్రరాజు	ఆర్‌డబ్ల్యూఎస్	9440387471
ఎస్.షాలెంరాజు	ఏఈ విద్యుత్ శాఖ	9440812645
డా.సీహెచ్.ఇందుప్రియ	వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కపిలేశ్వరపురం	9059032457
డా.వీవీరమణమూర్తి	వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, అంగర	9989789978
అధికారి గజలక్ష్మి	సీడీపీఓ మండపేట ప్రాజెక్ట్, ఐసీడీఎస్	8500758785
త్రిమూర్తులు	ఏఈ ఇరిగేషన్ ఆలమూరు సెక్షన్	9989329772
సుబ్రహ్మణ్యం	ఏఈ ఇరిగేషన్ కోటిపల్లి సెక్షన్	9908484824
అజీజ్	ఏఈ ఇరిగేషన్ రామచంద్రపురం సెక్షన్	8500786756
వి.సుజాత	ఇరిగేషన్ ద్రాక్షారామ సెక్షన్	7702322777